కథానిక

# బంజర్ల పంపకం

పి. వి. పల్లి

సీతారామయ్యగారు వీధి అరుగుమీద కూచుని చుట్ట కాలుస్తున్నారు. ఏదో దీర్ఘాలోచనలో వున్నట్టుంది. ఇంతలో వీరేశు వచ్చి చేతులు జోడించి ఎదురుగా నిలబడ్డాడు.

దించిన బుర్ర మీదికెత్తేరు సీతారామయ్యగారు.

"దండాలండి —"

"ఏం యిలా వచ్చావ్?"

"తమ కాడికే నండి."

"ఏం?-చెప్పు."

"మరేంలేదు-మన ప్రభుత్వం మాబోటిగోళ్లకి నివేశనాలు, భూముల్లేనివాళ్లకి కొద్దో గొప్పో భూములూ యిస్తారని యిన్నాం-అందుకని..."

"అవును-కాని; గొప్ప కష్టం."

"తమరు తలుచుకుంటే కష్టం యేముంటదండి."

"చాలా కష్టం-ఆ విషయం తలచడం మానుకోవడమే మంచిది."

"అలా అనకండి-తమరున్నారనే ధీమాకొద్దీ-మా కాశ కలుగుతోంది."

"మీ ఆశ ఎవడిక్కావాలిరా! వాళ్లు యిస్తామంటే నేను ఒద్దంటానటరా ... యిస్తే తీసుకోండి."

"మరేంలేదు." చేతులు జోడిస్తూ "దరఖాస్తు పడేస్తే ఎందుకేనా మంచిదని."

"పడేసెయ్-నే ఒద్దంటానా?"

"అది కాదండీ-అంతా మీ పరిముఖంగానే జరగాల-ఆ పని కానియ్యండి. మీ కట్టు ముంచుగోముగా."

"ఒకవ్వేళ-ఆ పని కాకపోతే నేను పడ్డ శ్రమ అంతా వృధాయే కదా!"

"అలా అనుకోకండి-యిదో యిప్పుడే తెత్తా; మా కుటుంబాలు పడేనుండామండి. యిల్లుట్టుకోడానికి యాభై సెంట్లు చాలునండి. తలా ఆయిదెకరాలూ యిప్పిస్తే దున్నుకుంటామండి-మరి మాకేమయ్యి లేదుగంద. అదీ యిదీ-తమ దయ."

"సరేనా కోరికలు-యింకా యేమేనా వున్నాయా?"

"ప్రభువులు క్షమించాలి. అయిదేసి రూపాయిలు యిచ్చుకుంటామండి."

"చూదాం. యింకా మెట్లున్నాయి - అన్నీ యెక్కితేనేగాని దేవుడి దర్శనం కాదు."

"తప్పుద్దాయేటండి!"

"సరే సాయింత్రం రండి అందరూ - యీలోపల నేను రాసి వుంచుతాను. సంతకాలు పెట్టేసి పడేద్దురుగాని."

"తమ దయ-తమల్ని నమ్ముకున్నాం."

"ఫరవాలేదు లే-కార్యం అయేదాకా నిద్ర పట్టితే ఒట్టు-నా పట్టుదల నీకు తెల్సుగా."

"మరేమండి-ఏదో మీ పేరుచెప్పుకుంటాం"

"సరే వెళ్లు-నాకు పనుంది."

"చిత్తం-మరో మాట. మనూళ్ళో కొండదిగువనున్న బంజరుకన్న, తూర్పు దిక్కునున్నది అయితే నాలుగ్గింజలు పండుతయండి."

"సాయింత్రం-రా-ఆలోచిద్దాం."

* * *

"ఒరే మన రామయ్యగోరంటే అచ్చంగా రాముడేన్రా."

"బాగా సెప్పావురా - ఆ రాముడికే నా మచ్చడ్డది. కాని మన రాముడుగోరికి ఎక్కడా మచ్చ నేదురా."

"చుట్టుపక్కలో పది, పాతిక గ్రామాల్లోనూ సీతారామయ్యగోరంటే-మోత."

"తగ్గించండిరా, ఇలా రండి. ఒకొక్కళ్లూ సంతకాలు సెయ్యండి."

"అంతపాటి భాగ్యానికి నోసుకోలేదండి."

"చిన్నప్పుడు చదువుకుంటే యెంత బాగుండును."

"ఏటో బీదోళ్ళం. మా కెందుకు బాబూ చదువులు. నౌకరీవోళ్లం."

వేలిముద్రలూ, సంతకాలూ అయాయి.

"బాబూ యెక్కడ భూమి రాశారండి?"

"అదంతా మీ కెందుకు, వెళ్ళుదురూ. మీకు కావలసింది భూమి. అంతేకాదూ?"

"ప్రభువులు."

"మహారాజులు."

"ఒరే మన పనవాల-బాబుగోరికి కనకాభిషేకం చేసెయ్యమురా."

* * *

"నమస్కారం సార్."

సీతారామయ్య అంత పెక్కుగా అన్నాడంటే వెంకట్రామయ్యగారు తికమకపడ్డా రాతని ధోరణికి. అయినా సముదాయించుకుని

"రావోయ్-ఏమిటి విశేషాలు?"

"ఏ రేంలేదు-మా వూళ్ళో సుమారు ఓ వంద యెకరం బంజరుంది. అది యెవరికీ అమరకం కాలేదు. మన రికార్డులో యెక్కడా అమరకం అయినట్లుగా లేదు. మా వూళ్ళో పదిహేను కుటుంబాలవాళ్ళు హరిజను లున్నారు. వాళ్ళకి పంచేస్తే..."

"బాగుంటుందంటావ్."

"అఁ...మరేఁ..."

"నిలబడిపోయావ్-కూచో. ఒరే రాములూ! మునసబుగారికి కాఫీ పట్టుకురా."

"చిత్తం—"

"యిప్పుడే తాగొచ్చాను సార్."

"వెధవది నీళ్ళకేముంది. ఎన్నిసార్లయినా తాగొచ్చును."

"అయితే కలక్టరాఫీసుకు వెళ్ళాలి కదా యీ కాయితాలు, మరి మనం స్ట్రాంగుగా రికమెండు చెయ్యాలంటావ్. అంతేనా."

"తమకి తెలియనిదేముంది? అదీగాకుండా వాళ్లు వుండడానికి యిళ్ళు లేవు. కట్టుకోడానికి కూడా ఓ యెకరం మేర వాళ్ళకి పారేస్తే వాళ్లు సంతోషిస్తారు. యిందులో మనకి యేమీ లోటు వుండదు."

"మరి మీ వూరు ఓసారివచ్చి ఆ 'లేండ్' చూడాలి. తరువాతగాని ఎలా రికమెండ్ చేస్తాం?"

"నేను అబద్ధం ఆడతానంటారా?"

"అబ్బెబ్బె-పోనీ అలానే కానీ, నీ మాటకి ఎప్పుడేనా యెదురాడానా? రేషనింగు టైములో మాత్రం నీ మాటకి ఎప్పుడేనా ఎదురుచెప్పానా?"

బంట్రోతు కాఫీ యిచ్చాడు. మునసబుగారు తాగి సిజర్ సిగరెట్టు బల్లమీ దుంచారు.

"నువ్వూ ఒకటి తీసుకోవోయ్."

"చిత్తం-తమలాంటి పెద్దలవద్ద..."

"అంతా సమానమేనోయ్."

"మునసబుగారు యీమధ్య అయిపులేదండి సార్" అన్నాడు బంట్రోతు.

"వూళ్ళో వ్యవహారాలన్నీ యితని వేనురా. అన్నీ సర్దుబాటుచేస్తేగాని యెలారాగలను? గ్రామ యజమానులంటే, సామాన్యులటరా ఓ చిన్న జమీందారీఫాయిలో నుంటారు. హమేషా నౌకర్లుంటారు"

"తప్పు బాబూ తమరు అలా అనకూడదు."

"మొత్తం వందఎకరాలూ వాళ్ళకి అంటగట్టాలంటావ్."

"యేముందండీ మనిషికి ఆరెకరాలుకన్న ఎక్కువలేదు మిగిలింది కొంత గడ్డలు వగైరా."

"సరే అయితే ఫైలు ఎప్పుడుతీద్దాం?"

"నన్ను నమ్మరా- మునసని కానివ్వండి. అటు నుండి ఆర్డరురావడం మన....."

"వాళ్ళ నెవరు నమ్ముతున్నాడు."

"నేనున్నానుగదూ మీకేం అనుమానంఅక్కర్లేదు. అవన్నీ నేను చూచుకుంటానుకదూ?"

"సరే నువ్వలాఅంటే నేను ఏంఅనగలను?"

* * *

"ఒరే వీరేశూ మీ పంట పండిందిరా."

"బాబుగారు తమరుతలచుకుంటే..."

"సరేగాని యీవిషయం యెవరితోటీ అనకు సుమా!"

"సరిసరి యెవరోకటా"

"కాని ఒక్కమాట. యిలారా."

దగ్గరకిపిలిచి ఏదో మెల్లిగా చెప్పారు సీతారామయ్యగారు.

"అలాగే బాబూ మాకావుపకారం మీకీ ఉపకారం."

"ఒరే వీరేశూ, నువ్వుఘటుకుడివిరా నువ్వు అంగీకరిస్తావనుకోలేదు. అది అలా కానీ ఆతరవాత అందులో ఎకరంభూమి నీకుఅదనంగా యిప్పిస్తా."

"సెబువులు తమమాటకడ్డా ఇంకా...!"

"సరేగాని ఆరోజున చెప్పింది మరచిపోయావా?"

"అంటే..."

"పైమెట్లు సంగతి..."

"అదాబాబూ- తమరెలా చెపితే అలానడుచుకుంటామండి."

మూడు వేళ్లు చూపించారు సీతారామయ్యగారు.

"అయ్యబాబోయ్ మొత్తం నాలుగు."

"ఒరి వెర్రివాడా, మనిషికి అయిదెకరాల దాకావస్తుంటే అలా అంటావేం."

"నాలుగెకరాలండీ."

"అలా అనవద్దని చెప్పేనుకదురా."

"అవును మరచిపోయానండీ తమరు కటాక్షించాల అంతవరకు వెళ్ళలేం"

"పోనీ మూడున్నరచేసుకో పోనీ తిరుగుండ కూడదు. మూడున్నరతో పందయెకరం."

"మహారాజులు!—"

వీరేశు వెళ్లిపోయాడు.

సీతారామయ్యగారు పరమానంద భరితులయి పోయారు. ఆయన సంతోషానికి మేరలేదు.

"పట్టాలుయిచ్చేదినం" ఘనంగా జరపించాలి మన ఏరేంజిమెంట్సుకి కలెక్టరు ఉబ్బివబ్బిబ్బయి పోవాలి అంతే.

* * *

కలెక్టరుగారిరాక స్థిరపడిపోయింది. తాసిల్దారు రివెన్యూఇన్స్పెక్టర్లూ యీ మొదలగు అధికారులు అనధికార పెద్దలూ, గ్రామీణులూ, అంతా సుమారు మూడు వేలమంది హాజరయ్యారు మహాసభకి.

ఊరికిబయట పెద్దపందిరి వేయబడింది. సీతారామయ్యగారి హడావుడికి అంతేలేదు. పందిరి అలంకరణ విలువ నూరురూపాయిలకన్న ఎక్కువే ఉంటుంది.

కారు పందిరిదగ్గరాగింది. కలెక్టరుగారు కారు దిగారు. వరుసగా అందరూ పూలమాలలు వేశారు జైజై నినాదాలు మిన్నుముట్టాయి.

అధ్యక్షస్థానాన్ని అలంకరించారు కలెక్టరుగారు. అందరూ కూర్చున్నారు.

ఘనమైన స్వాగతానికి మెచ్చుకున్నాననీ. గవర్నమెంటువారు హరిజనులయెడ చూపుతున్న ఆదరాభిమానాలకి అంతులేదనీ, అడిగిందే తడవుగా ఒక్క కానీ ఖర్చులేకుండా అన్నిసదుపాయాలూ ప్రభుత్వం హరిజనులకు చేస్తూందనీ - ఆలోచన అక్కర్లేకుండా అందరూ తమ తమ కోర్కెలని వెల్లడిస్తే ప్రభుత్వం ఆ కోర్కెలని నెరవేర్చడానికి సిద్ధంగావుందనీ - యిట్లా అరగంటసేపు ఉపన్యసించారు.

తరువాత సీతారామయ్యగారు వేదికయెక్కి హరిజనులకు భూములు మంజూరుచేసిన ఆర్డర్లు చదివారు.

తరువాత ఒక్కొక్కరి పేరూ చదవ్వాలసినదనీ, వాళ్లువస్తే తాను పట్టాలనిస్తాననీ కలెక్టరుగారు అన్నారు. సీతారామయ్యగారు ఒక్కొక్కరి పేరూ చదవడం మొదలుపెట్టారు.

మొదట వీరేశంపేరు చదివారు. వాడు వచ్చాడు. రాగానే కలెక్టరుగారి కాళ్ళదగ్గర సాష్టాంగ దండప్రణామంబు లాచరించాడు, సీతారామయ్యగారి కనుసన్నపైని. రెండోవాడు, మూడు...అలా పద్నాలుగురు అయింతర్వాత పదిహేనోవాడు వచ్చాడు. కాని సీతారామయ్యగారి కనుసంజ్ఞ చూడనట్లు నటించి పట్టా అందుకున్నాడు.

"మహాప్రభో... ఉచితంగా యిస్తామన్నారు. కాని నాలుగొందలయిందండి. సీతారామయ్యగారికి పాతిక యెకరాలటండి - ఏలినవారు దరియాప్తు సెయ్యాల - తమ మాటకి తిరుగులేదు."

"ఏమయ్యా—"

నీళ్లు నములుతూ—

"లేదండి వాళ్లునామీదకిట్టికచెబుతున్నారండి"

"కాదుబాబూ-యింకా పైమెట్లున్నాయని-యేమేమో అన్నారండి. తమతో చెపదాం అనిమేం యేమీ అనలేదు."

"అలా స్టేటుమెంటు యియ్యి—"

"చిత్తం అలాగేనండి—"

"సర్కిలుగారూ ఆ స్టేటుమెంటు ప్రకారం అందర్నీ తీసుకురండి—" కోపంతో కలక్టరు వేదిక దిగి వెళ్ళిపోయారు.

★